క్లుప్తంగా

నేడు సత్యదేవునికి జన్మ నక్షత్ర పూజలు

అన్నవరం: సత్యదేవుని జన్మనక్షత్రం 'మఖ' సందర్భంగా శనివారం స్వామివారికి పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, ఆయుష్య హోమం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు. పండితులు తెల్లవారుజామున రెండు గంటలకు స్వామివారి ఆలయం తెరిచి ప్రత్యేక పూజలు చేస్తారు. స్వామి, అమ్మవారు, శంకరుల మూల విరాట్‌లకు పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం పుష్పాలు, స్వర్ణాభరణాలతో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేసి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతిస్తారు. మాఘపౌర్ణమి, స్వామివారి జన్మనక్షత్రం ఒకేరోజు రావడంతో ఆలయానికి భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉంది.

యువతికి న్యాయం చేయాలంటూ ఆందోళన



ఏలేశ్వరంలో ఆందోళన చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: ప్రేమించిన వ్యక్తి మోసం చేశాడని మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసిన యువతికి న్యాయం చేయాలని కోరుతూ పట్టణంలో శుక్రవారం మహిళలు ఆందోళన చేశారు. సీపీఐ(ఎంఎల్)వినోద్‌మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో మహిళలు ఆందోళన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వినోద్ మిశ్రా పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ వినోద్‌మిశ్రా నగర్‌కు చెందిన యువతిని అదే ప్రాంతానికి చెందిన రవికుమార్ మోసం చేయడం దారుణమన్నారు. యువతికి న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామన్నారు. మహిళల హక్కుల రక్షణ కోసం తమ పార్టీ పోరాడుతుందన్నారు. యువతిని రవికుమార్ వెంటనే వివాహం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గండేటి నాగమణి, గుమ్మడి పాదాలమ్మ, పిల్లా కాంతం, వరలక్ష్మి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి



ఏలేశ్వరంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్

ఏలేశ్వరం: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ అన్నారు. పట్టణంలో నియోజకవర్గ స్థాయి బీజేపీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రామ్‌కుమార్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీకి ఒక అవకాశం, కేంద్రంలో మరో అవకాశం ఇవ్వాలనే నినాదంతో ముందుకు వెళతామన్నారు. అధికారం చేపట్టే దిశగా పార్టీ శ్రేణులను సమాయత్తం చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో పార్టీ శ్రేణులకు ఈ కార్యాలయం అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, జిల్లా సభ్యుడు గట్టెం వెంకటరమణ, పార్టీ మండల, పట్టణాధ్యక్షులు కురాకుల రాజా, రెడ్డి లోవరాజు, కందావీరాస్వామి, గొల్లపల్లి త్రినాథ్, కర్రి ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కిర్లంపూడి: జగపతినగరం అభయ దుర్గమ్మ, కిర్లంపూడి శివారున వేంచేసిన వనదుర్గమ్మ అమ్మవార్ల ఆలయాల వద్ద శుక్రవారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బెండపూడిలో మహిళల ర్యాలీ

తొండంగి: ప్రభుత్వం సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేయాలని కోరుతూ శుక్రవారం బెండపూడిలో మహిళలు ర్యాలీ నిర్వహించారు. గ్రామాల్లో సారా విక్రయాల కారణంగా తమ కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. మద్యం, సారాను అరికట్టాలని నినాదాలు చేశారు. ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వం మద్యపానాన్ని పూర్తిగా నిషేధించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జాగ్రత్తలు పాటించాలి

తొండంగి: మాఘపౌర్ణమిని పురస్కరించుకుని శనివారం మండలంలోని సముద్ర తీర ప్రాంతాల్లో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై వినయ్‌ప్రతాప్ సూచించారు. అద్దరిపేట నుంచి కొత్తపోడిపల్లిపేట బీచ్ వరకూ భక్తులు సముద్రస్నానాలు చేసే ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామన్నారు. అలాగే 30 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించనున్నట్టు తెలిపారు. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే సమయంలో తమ విలువైన వస్తువులు, పిల్లల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జేబు దొంగలు, దోపిడీకి అవకాశం లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే 94409 04847 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

జగన్ పాలనలోనే మహిళాభ్యున్నతి



గోకవరంలో మహిళలకు వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కు పంపిణీ చేస్తున్న తోట నరసింహం

- వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- గోకవరంలో డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ

గోకవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మహిళలు అన్ని రంగాల్లో అభ్యున్నతి సాధించారని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం మహిళలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొని మండలంలోని 843 మహిళా సంఘాలకు రూ.13.42 కోట్ల విలువైన నమూనా చెక్కును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో మహిళలను అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలను అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి రాష్ట్రంలో అనేక మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి సొంతింటి కలను నెరవేర్చారన్నారు. గోకవరంలో లబ్ధిదారులకు త్వరలోనే ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామన్నారు. మహిళలు ప్రభుత్వ పథకాలను, ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

వలంటీర్లు సంక్షేమ సారథులు

గ్రామ వలంటీర్లు సంక్షేమ సారథులు అని తోట నరసింహం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొని వలంటీర్లకు సేవావజ్ర, సేవా రత్న, సేవామిత్ర అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేస్తున్నారన్నారు. లబ్ధిదారులకు పారదర్శకంగా మెరుగైన సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట రాంజీ, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, సుంకర వీరబాబు, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, మండల కన్వీనర్ పాటి రాంబాబు, నాయకులు సమ్మెటి నాని, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి విశేష ప్రజాదరణ



సమావేశంలో మాట్లాడుతున్న కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

- పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ప్రత్తిపాడు రూరల్: ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయని, దీంతో వైఎస్సార్ సీపీకి ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోందని ఆ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో పార్టీ మండల కన్వీనర్ రామిశెట్టి బులిరామకృష్ణ అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరుపుల సబ్బారావు మాట్లాడుతూ సచివాలయ కన్వీనర్లు ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి పార్టీ విజయానికి పాటుపడాలన్నారు. కులమతాలు, రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిని చేస్తే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైస్ ఎంపీపీ ఏనుగు శ్రీను, సొసైటీ చైర్మన్లు వరుపుల సూరిబాబు, కొప్పన గంగారావు, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యుడు దోశె చిట్టిబాబు, సర్పంచులు గౌనగాల అప్పలరాజు, బొండు రాంబాబు, ఏపూరి రాంబాబు, ఎంపీటీసీలు జువ్వల సుజాత, పిల్లా చిన్న, జల్లిగంపల ప్రభాకరరావు, గుడాల రామకృష్ణ, పినిశెట్టి ప్రకాష్, గొల్లపల్లి దొరబాబు, మామిడి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలి



శంఖవరంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏఓ గాంధీ

శంఖవరం: రబీ వరిసాగు చేసిన రైతులు చీడపీడలు, తెగుళ్ల నివారణపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. శంఖవరంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేస్తున్న వరి పంటను శుక్రవారం రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట ఏపుగా పెరగడానికి ఇంగువ ద్రావణం ఎకరాకు 10 లీటర్ల చొప్పున పిచికారీ చేయాలన్నారు. ఆకు మడత తెగులు నివారణకు వావిలాకు కషాయం ఎకరాకు 10 లీటర్లు పిచకారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు విలియం, వికాశ్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోమరాజు, సుబ్బారావు, సూర్యప్రకాశ్ పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం



వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు



గోకవరం దేవీచౌక్ ఆలయంలో చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేదపండితులు సామవేదం శర్మ, దత్తాత్రేయశర్మ, ఫణిశర్మ, దేవులపల్లి ప్రకాష్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. ఆలయ సూపరింటిండెంట్ ఐవీ రామారావుతో పాటు 30 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు ఇంద్రగంటి నర్సింహమూర్తి ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ పండితులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

నేడు ప్రత్యంగిర హోమం

మాఘ పౌర్ణమిని పురస్కరించుకుని శనివారం వనదుర్గ అమ్మవారికి ప్రత్యంగిర హోమం నిర్వహించనున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.

ఘనంగా చండీ హోమం

గోకవరం: స్థానిక దేవీచౌక్ ఆలయం వద్ద శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ అర్చకులు వల్లూరి జగన్నాథశర్మ, శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో సాయంత్రం హోమం నిర్వహించారు. ఉదయం అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు విశ్వహిందూ పరిషత్ రామసేన సమితి వ్యవస్థాపకుడు కంబాల శ్రీనివాస్‌రావు పులిహోర ప్రసాదాన్ని వితరణ చేశారు.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



లింగంపర్తిలో పార్టీలో చేరిన వారితో కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: మండలంలోని లింగంపర్తి గ్రామంలో పలువురు శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన 50 కుటుంబాలు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు సమక్షంలో పార్టీలో చేరాయి. వారికి వరుపుల సుబ్బారావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వందలాదిగా ఇతర పార్టీలకు చెందిన వారు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

26న భవ్య పంచాయతన క్షేత్రానికి శంకుస్థాపన

గండేపల్లి: మండలంలోని పి.నాయకంపల్లిలో తత్వం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 26న భవ్య పంచాయతన క్షేత్రం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్టు ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ పశర్లపాటి శ్రీనివాస బంగారయ్య శర్మ తెలపారు. శృంగేరి పీఠం భారతి తీర్థమహాస్వామి, విధుశేఖర భారతీస్వామి ఆశీస్సులతో పంచాయతన క్షేత్రం నిర్మిస్తున్నట్టు తెలిపారు. గ్రామానికి చెందిన అలివేలుమంగ రెండు ఎకరాల భూమిని తత్వం చారిటబుల్ ట్రస్ట్‌కు దానం ఇవ్వగా ట్రస్ట్ మరో మూడు ఎకరాల పొలం కొలుగోలు చేసి మొత్తం ఐదు ఎకరాల్లో భవ్య పంచాయతన నవగ్రహ క్షేత్రం, గోశాల, వేద పాఠశాల, అగ్నిహోత్రం నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో చండీయాగం నిర్వహిస్తామన్నారు. ప్రముఖ ప్రవచన కర్తలు సామవేదం షణ్ముఖ శర్మ, ముదికొండ శంకర శర్మ, బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి, డాక్టర్ అనంత లక్ష్మి, శంకర మంచి రామకృష్ణ శర్మ, భగవద్గీత గంగాధర్ శాస్త్రి, మైలవరపు శ్రీనివాసరావు, ప్రముఖ సినీ నటులు తనికెళ్ల భరణి, జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, సౌందర్యలహరి కొండూరి పద్మావతి, నిట్టల కిరణ్మయి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని వివరించారు.

వీధిలైట్లు పగలు వెలగకుండా చర్యలు



ఏలేశ్వరంలో విద్యుత్ వైర్లను సరిచేస్తున్న సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

ఏలేశ్వరం: పట్టణంలోని పలు ప్రాంతాల్లో వీధిదీపాలు పగలూ, రాత్రి తేడా లేకుండా నిరంతరం వెలుగుతున్నాయి. దీనిపై ఈ నెల 22న 'పట్టపగలే విద్యుత్ వెలుగులు' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. స్థానిక షిర్డీ నగర్‌లోని మహిళా మండలి భవనం వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు నిర్వహించారు. వీధి దీపాలు పగలు వెలగకుండా చర్యలు తీసుకున్నారు. విద్యుత్ స్తంభాలు ఎక్కి ప్రధానవైర్లను సరిచేశారు. సమస్యను పరిష్కరించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



కోటనందూరులో లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శ్రీనివాసు

కోటనందూరు: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు. మండలంలోని జగన్నాథపురం, బొద్దవరం, బిళ్లనందూరు, అప్పలరాజుపేట, కేఈఎస్ కొత్తూరు, కొత్తకొట్టాం, టీజే నగరం, అల్లిపూడి, భీమవరపుకోట గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.3.95 లక్షల విలువైన చెక్కులను వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబుతో కలిసి ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ ఆరోగ్య రీత్యా ఆపదలో ఉన్న పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు సుర్ల రాంబాబు, పసగడుగుల వరహాలు, జీగటాల వీరబాబు, ఏఎంసీ చైర్మన్ సుర్ల రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమిల్లి గోవిందు, వేగి అప్పలనాయుడు, బొత్స సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

సారా బట్టీపై పోలీసుల దాడి

తొండంగి: మండలంలోని వేమవరం శివారులో సారా బట్టీలపై శుక్రవారం దాడి చేసినట్టు స్థానిక ఎస్సై వినయ్‌ప్రతాప్ తెలిపారు. వివరాల్లోకి వెళితే...వేమవరం శివారు బీచ్‌లో సారా తయారీ చేస్తున్నట్టు సమాచారం రావడంతో గురువారం అర్ధరాత్రి ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పంపాదిపేటకు చెందిన మైలపల్లి సత్తిబాబును అరెస్టు చేసి అతని నుంచి 150 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. మరో ఇద్దరు నిందితులు పరారయ్యారు. సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వైఎస్సార్ సీపీకి అండగా క్రిస్టియన్లు



తునిలో మంత్రి రాజాను కలిసిన క్రైస్తవ సోదరులు

తుని: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో క్రైస్తవులందరూ వైఎస్సార్ సీపీకి అండగా ఉంటారని ఆ పార్టీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెక్రటరీ స్టిఫెన్ ఆనంద్ అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరం క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖామంత్రి దాడిశెట్టి రాజాను ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడు రిక్కీ గూటం, కాకినాడ జిల్లా క్రైస్తవ సోదరులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్టిఫెన్ ఆనంద్ మాట్లాడుతూ వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో క్రిస్టియన్లు కలసికట్టుగా పని చేసి వైఎస్సార్ సీపీని అధికారంలోకి తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. అందుకు తగిన కార్యాచరణను ఇప్పటికే రూపొందించామన్నారు. స్టిఫెన్ ఆనంద్‌ను మంత్రి దాడిశెట్టి రాజా శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో తుని క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడు, జిల్లా యువజన విభాగం ఉపాధ్యక్షుడు జాన్ ఆనంద్, కార్యదర్శి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథిని మళ్లీ గెలిపించండి



రౌతుపాలెంలో మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- రౌతుపాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రత్తిపాడు రూరల్: రాష్ట్రంలో ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని రౌతుపాలెంలో శుక్రవారం సాయంత్రం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ నాయకులు కొంగన కుమార్, నిమ్మల చక్రం, నేదుళ్ల శ్రీను తదితరులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆయన పాలనలో అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేకూరిందన్నారు. ప్రతిపక్షాలు ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నాయన్నారు. ప్రతిపక్షాల అబద్ధాలను నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రామిశెట్టి బుల్లి రామకృష్ణ, పార్టీ మండల మాజీ కన్వీనర్ బెహరా దొరబాబు, అన్నవరం ట్రస్ట్ బోర్డ్ సభ్యుడు దోశె చిట్టిబాబు, సొసైటీ చైర్మన్లు కొప్పన గంగారావు, దోశె హరిబాబు, జల్లి గంపల ప్రభాకరరావు, గొల్లపల్లి దొరబాబు, మేడిబోయిన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న తోట నరసింహం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- జగ్గంపేటలో వైఎస్సార్ సేవాదళ్ కార్యకర్తలతో సమావేశం

గండేపల్లి/జగ్గంపేట: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి సేవాదళ్ కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం సూచించారు. జగ్గంపేటలో శుక్రవారం కాకినాడ జిల్లా జేసీఎస్ కో ఆర్డినేటర్ ఒమ్మి రఘురాం అధ్యక్షతన నియోజకవర్గంలోని వైఎస్సార్ సేవాదళ్ విభాగం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలన్నారు. రాష్ట్ర భవిష్యత్ బాగుండాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి ప్రభుత్వ పథకాల రూపంలో ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించాలన్నారు. వైఎస్సార్ సేవాదళ్ ఉభయగోదావరి జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ సీహెచ్ వెంకటరాయుడు మాట్లాడుతూ జిల్లాలో మొదటి సమావేశం జగ్గంపేటలోనే నిర్వహిస్తున్నామన్నారు. కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. తొలుత దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యువ నేత తోట రాంజీ, వైఎస్సార్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, పార్టీ గండేపల్లి మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, పార్టీ సీనియర్ నాయకులు అత్తులూరి సాయిబాబు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షుడు పాము సూరిబాబు, జగ్గంపేట టౌన్ కన్వీనర్ గొల్లపల్లి శ్రీను, నాలుగు మండలాల సేవాదళ్ అధ్యక్షులు సుంకవల్లి శ్రీను, కీలపర్తి వీరబాబు, నరాలశెట్టి నరసయ్య, కర్రి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ



ఎంఈఓ కార్యాలయం వద్ద నోటీస్ బోర్డులో వివరాల పత్రం అతికిస్తున్న ఎంఈఓ

గండేపల్లి: ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశానికి అర్హులైన పేద విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఎంఈఓ కేహెచ్ నాయక్ తెలిపారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి అన్ని ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో అనాథలు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ఓసీ పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలన్నారు. దీనిలో భాగంగా అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 23 నుంచి మార్చి 14వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

శాంతి భద్రతలపై మరింత నిఘా

- జిల్లా ఎస్పీ సతీష్ కుమార్



కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

కిర్లంపూడి: మండలంలో శాంతి భద్రతలపై మరింత నిఘా ఏర్పాటు చేసినట్టు జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా శుక్రవారం కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని సమస్యాత్మక గ్రామాల్లో మరింత భద్రతను పెంచుతామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పాత కేసుల్లో ముద్దాయిలపై బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నట్టు తెలిపారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎస్సై ఎస్.రామలింగేశ్వరరావు, హెడ్ కానిస్టేబుల్ ఎన్‌వీ రమణ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.